దుర్గాదేవీ ప్రణామం !

- ఘనంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఎనిమిదో రోజూ ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు
- నగరంలో ఆధ్యాత్మిక సందడి


దుర్గాదేవీగా చదునుమహాలక్ష్మి అమ్మవారు


దుర్గాదేవీ అలంకరణలో గంగానమ్మ అమ్మవారు


విష్ణుపాదోద్భవిదేవిగా పద్మావతి అమ్మవారు


దుర్గాదేవీ అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు


చిట్టినగర్‌లో దుర్గా దేవీగా


భీమనవారిపేటలో మహిషాసురమర్దనిదేవి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మ వార్లు దుర్గాదేవీగా దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని అమ్మ వార్లను దర్శించుకున్నారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అధికారులు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పలు ఆలయాల్లో..

కేటీ రోడ్డులోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవీగా దర్శనమిచ్చారు. బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానలో అమ్మవారిని దుర్గాదేవీగా అలంకరించారు. ఉభయదాతలు తెల్లవారుజాము నుంచి కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్ములకు కూడా ప్రత్యేక అలంకరణ గావించారు. ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ పర్యవేక్షించింది. నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు శార్దూల వాహనాన్ని అధిష్ఠించి దుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో కుంకుమార్చనలు, ఖడ్గమాలార్చన, చండీహోమం తదితర ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగరాజు పర్యవేక్షించారు. శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవీగా భక్తులకు అభయముద్రతో దర్శనమిచ్చారు. ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు ఆదివారం శ్రీ విష్ణుపాదోద్భవిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పలు ఏర్పాట్లు చేశారు. కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాసు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చిట్టినగర్ పరిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ భవానీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో అమ్మవారిని శ్రీ దుర్గాదేవీగా అలంకరించారు. ఆలయ అర్చకుడు దంటు భవానీశర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పూజలను పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ జరిపించారు. ఉత్సవాలను పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షించారు. భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దని దేవీగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజలు నిర్వహించగా పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. చిట్టినగర్‌లో వేం చేసిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారు దుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనురాధ దర్శించుకున్నారు. ఉత్సవాల ఏర్పాట్లను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులతో పాటు పలువురు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. చండీహోమంలో సందక వెంకట రామప్రసాద్, లక్ష్మీ సంతోషిని, సుంకర కుమార్, మల్లిక దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షించారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు సాయంత్రం పంచహారతుల సేవ నిర్వహించారు.

కేదారేశ్వరపేటలో..

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కేదారేశ్వరపేట ఆరు పంపుల బావి వీధిలో శ్రీ శివకాళేశ్వరీ దేవి దుర్గాదేవీగా భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ నిర్వాహకులు కట్టా బాబ్జి, రమణారావు, రాజు తదితరులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


వాగు సెంటర్‌లో హోమం నిర్వహిస్తున్న అర్చకులు


కరకట్ట వద్ద దుర్గాదేవిగా


పాలప్రాజెక్టు క్వార్టర్స్ వద్ద వారాహిదేవి


కేదారేశ్వరపేటలో దుర్గాదేవిగా శివకాళేశ్వరిదేవి

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



విజయవాడకల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ ఘనాపాటి అన్నారు. కృష్ణా మండల వేద విద్వత్ సభ దసరా మహోత్సవాలు, శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాయలంలో ఆదివారం చతుర్వేద సభను నిర్వహించారు. వేద సభను ప్రారంభించిన లక్ష్మీ నారాయణ ఘనాపాటి మాట్లాడుతూ నదీ నగారాటున్న చోట వేద విద్యకు ఆదరణ ఉంటుందన్నారు. కృష్ణా మండల వేద విద్వత్ సభ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది వేద పండితులు సామవేదం, అధ్వర్వణ వేదం, యజుర్వేదం, రుగ్వేదం పారాయణం చేశారు. వేద పండితులను మాగంటి వేణుగోపాలశర్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ శర్మ, పాలకమండలి సభ్యుడు ఎ.ప్రభాకర్ శర్మ పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణతో ఉపాధి అవకాశాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కంప్యూటర్ శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని డాక్టర్ నవ్య అన్నారు. గవర్నర్‌పేటలోని సన్ ఇన్ఫో టెక్నాలజీస్ ఇనిస్టిట్యూట్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఆకట్టుకుంటున్న కళా ప్రదర్శనలు

విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళావేదికపై నిర్వహిస్తున్న కళా ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం కళాకారులు కనకదుర్గ వైభవాన్ని చాటుతూ నృత్యాలను ప్రదర్శించారు. భాగవతుల సౌమ్య తన బృందంతో జయదుర్గే శ్రీ దుర్గే, ఆయగిరి నందిని నందిత మోహిని అంశాలను నేత్రపర్వంగా ప్రదర్శించారు. ఎం.సాయి మంజూష, ఎంవీఎస్ఎస్ఆర్ నాగచంద్రిక, సత్యనిజ, జి.తన్విశ్రీ, వై.మానస, జి.శ్రీనివాస్, టి.మీనాక్షి, అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన టి.నాగేశ్వరరావు భక్తి గీతాలను, అక్షర వీణపై త్యాగరాజ కృతులను, తెనాలికి చెందిన అనూరాధ శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమాన్ని సైదా, గంగాధర్, రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు ప్రసాదాన్ని, ప్రశంసా పత్రాలను అందజేశారు.

అమ్మ సన్నిధిలో భక్తజనం









ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మ వారు దుర్గాదేవీగా దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భవానీలతో పాటు భక్తజనం తరలివచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ఉత్సాహంగా దాండియా నైట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో దాండియా నైట్ ఉత్సాహంగా జరిగింది. వేగా జ్యువెలర్స్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తొలుత రోటరీ సభ్యులతో కలిసి దుర్గాదేవి పూజ నిర్వహించారు. అనంతరం దాండియా, ఫ్యాషన్ షో నిర్వహించారు. మన సంస్కృతీ, సాంప్రదాయాలకు విలువనిస్తూ, ప్రతి ఏటా దాండియా నిర్వహిస్తున్నట్లు రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా దాండియా కింగ్, దాండియా క్వీన్, గర్బారాజు, గర్బారాణీలుగా విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. పలువురికి కన్సోలేషన్‌లు అందించారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు, క్లబ్ సెక్రటరీ సందీప్, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ నవనీత్ లోయ, కో చైర్మన్ నారాయణ, వైస్ చైర్మన్ మనీష్ జైన్, వేగా జ్యూయలర్స్ అధినేత నవీన్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.


దాండియా ఆడుతున్న మహిళలు


ఫ్యాషన్ షోలో పాల్గొన్న మహిళలు